కథ

# కష్టావధానం

- ఆర్.ఎల్.ఎన్. ప్రసాద్

మనదో మహా నగరం. ఈ నగరంలో నివసించే లక్షలాది ప్రజలు వారి వారి విద్య, ఉద్యోగ వ్యాపార పనుల నిమిత్తం, యింకా అనేక లావాదేవీల కోసం రాష్ట్రం నలుమూలల నుంచీ, మరియూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచీ కూడా అనునిత్యం ఈ నగరానికి వచ్చి పోతూ వుండే వేలాది మంది జనం, సిటీ బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారు కదా ! ఇంతమందిని తమ తమ గమ్యస్థానాలకు చేర్చే ఆర్.టి.సి.సిటీబస్‌లో పనిచేసే 'కండక్టరు' పని, నిజంగా కత్తి మీద సాము వంటిదే. డ్యూటీ ఎక్కి దిగిపోయే వరకు ప్రతినిత్యం, కొన్నివేల మందికి కండక్టరు సమాధానం చెప్పాలి. ఎందరో మహానుభావులు - రకరకాల మనుషులు - మనస్తత్వాలు. వీరందరినీ నొప్పించకుండా, తానునొవ్వకుండా తప్పించుకుంటూ తన డ్యూటీ తాను చేసుకుంటూ పోవాలి మరి. అటువంటి కండక్టరు సోదరుడు ఎటువంటి అనుభవాలు ఎదుర్కొంటున్నాడో, ఎటువంటి మనుష్యులను కలుసుకుంటున్నాడో చూద్దామా! మరింక ఆలస్యం దేనికి ఎక్కండి బస్సు. ఉదయం 8 గం.ల సమయం.

ఇబ్రహీంపట్నం నుండి నాంపల్లికి బస్సు బయలుదేరింది. బస్సు నిండుగా ప్రయాణీకులు. వెనక సీట్ల దగ్గర సిటీ కొచ్చే పాల వ్యాపారస్తుల పాలడబ్బాలు, ప్రయాణీకుల సూట్‌కేసులు వగైరా అక్కడక్కడ దారిలో అడ్డంగా వున్నాయి. వీటినీ, నిల్చున్న ప్రయాణికులనూ దాటుకుంటూ, సాధ్యమయినంత వరకూ నవ్వుతూ అక్కడక్కడ రోజూ ప్రయాణించే తెలిసిన ఉద్యోగస్తులనూ, యితర ప్రయాణికులనూ పలకరిస్తూ, పరామర్శిస్తూ, కండక్టరు విధి నిర్వహణ మొదలు పెట్టాడు. ఇంక చూడండి అతని కష్టావధానాన్ని.

❖ ❖ ❖

యస్. టికెట్ సార్ టికెట్ - చెప్పండి సార్ ఏడికి? నాంపల్లికా ఎన్ని ? ఒకటా - ఆ యింకా ! నీదన్నా - పాసా? ఆమీద్పార్ ఏడికి ? సైదాబాద్‌కి ఒకటా - జర చిల్లరియ్యండి సార్ - పొద్దుగాల, పొద్దుగాల 'సౌ' రూపాయలకి నేనేడ్కెల్లి చిల్లర దేవాలె సార్ ? నమస్తే, రెడ్డి సాబ్ - తమరు నిన్న రాకుంటిరి - అమ్మాయిది లగ్గం కుదిరిందంట గదా సాబ్ - గదే ! నిన్న మీరు రాలె అని యాద్ చేస్తుంటే చారి సాబ్ చెప్పిండు - గిట్ల అమ్మాయిది లగ్గం కుదిరిందని. మంచిది సార్ .... గట్లయితె తొందర్ల మాకు మంచి దావతుందన్నమాట. ఆ... రండిబై ఇంజాపూర్ దిగేటోల్లు రార్రి ..... ఆ రైట్ - చెప్పమ్మా ఏడికి ? అరె గట్ల సిగ్గు పడ్డవేందమ్మా - నేనేమన్న రెండా, మూడా అన్న - దాన్కి గట్ల సిగ్గుపడ్తున్నరు ? మంచిగుందమ్మ మీవరస జరుగు - తంబీ మీరు జరలోపటకు జరగర్రి - ఆ యస్ ! టకెట్ - యింకా ఎవలన్నా తీసుకోవాల్నా - జల్దీ చెప్పండి - ముంగట చెక్ పాయింటుంది మల్ల. జరపాసులు చూసుకోర్రి బైపాసులు చూసుకోర్రి. ఆ రావాల బియ్యం రెడ్డి నగర్. ఓయ్యా ! జరాగవయ్యా ఆగు. దిగేటోల్లను దిగనీ ముంగట. గట్ల తోస్కుంటరేవయ్యా ? సైన్మ టిక్కట్ల కాడ తోస్కున్నట్టు నువ్వు జర లోనికి ఘుసాయించు తంబీ - ఆ యిప్పుడెక్కర్రి. చెప్పు భాయీసాబ్ - చెప్పన్నా - టికెట్ - టికెట్ - జరనన్ను లోపటకు బోనీయర్రి. అవ్వ ! నీ కెన్ని మాట్ల చెప్పిన్నే యీ కూర్లగంప దార్ల కెల్లి తీయమని ? ఇంకా నీకెందుకే యీ పరేషానంత ? మంచిగ తిని కూసోరాదూ ! ఇంటికాద

పోరళ్ళు లేరు కమాయించేటోల్లు ?

ఏందీ పెండ్లి చేస్కోని ఎవని తోవ వాడు జూస్కున్నారు! గంతేనే దునియా ! గడ్డం మీసం వచ్చినంక అమ్మాలేదు అయ్యాలేదు మీదికెల్లి పెండ్లమొస్తే యింక మాటింటారు ?

అవ్వా ! మరి నన్ను పెంచుకోరాదె ! నాక్కూడ జర యీ కండక్టర్ పని బోర్ కొడ్తాంది. రోజూ కూరగాయలమ్మిపెడ్తే పెంచుకుంటావ్ ! ఉషారున్నవే నువ్వు కూడ - సరే వస్తతీయ్ ! ఆ రింగ్‌రోడ్ - దిగండి బాబూ రింగ్ రోడ్. రైట్ - రైట్ ! ఎవరయ్యా యిక్కడ రింగ్ రోడ్ల ఎక్కింది ?

రేయ్ పొట్టిగా ! గీటైంల గున్పం పారల దీస్కోని ఎక్కుతార్రా బస్సుల ?

ఎడ్కిబోవాల్రా నువ్ ? ఏందీ ? చంచల్‌గూడకి అరటిక్కట్టా ? నీ యవ్వ నీ గ్గిట్ట పెండ్లి చేసుంటే కమ్ సే కమ్ యిద్దర్ని దీసేటోడివి - నీకరటిక్కట్టార ? అరె ! నవ్వుతడు సూడుమల్ల - చల్ తీ - ఔర్ దో రూపాయ్ నికాల్.

యస్. టికెట్ ..... పెద్దయ్యా టికెట్ తీస్కున్నావె నువ్ ? అరె ..... ఏం శోచాయిస్తున్నవే - పెద్దమ్మ గిట్ల యాది కొచ్చిందా యేంది ? ఏడికి జల్దీ చెప్పుమల్ల.

తంబీ ! మీరా ఫుట్‌బోర్టు మీది కెల్లి పైకి రార్రి బై తమ్మీ నీకేరా చెప్పేది - యింటికాడ చెప్పొచ్చినవా లేదా? గిట్ల పరేషాన్ చేస్తరేరాబై !

ఛలో మాదన్నపేట దిగుర్రి. చెప్పు బ్రదర్ పాసా ? పాస్ చూపియ్ మల్ల - యేందీ చాదర్‌ఘాట్‌కో టిక్కట్టా? గింతకు ముందు పాసన్నవు గదా ! అంటే నేనడిగిన గాబట్టి టిక్కెట్టు - లేకుంటే పుక్కిటకు పోదామనుకున్నబై చాదర్‌ఘాట్‌కు ? సదువుకుంటున్నావ్ గదా ! మరి గిదేం బుద్ధి బై. చెకింగోళ్ళు పట్కుంటే 'దోసా' కట్టేటోడివి కదా! ఏం పోరగాళ్ళో ఏమో ! సద్వులు సద్వుతరు - జరంతైనా యిజ్జతు లేదు.

ఆ .... టికెట్ వోమ్మా ఏడ్కెల్లి తెస్తున్న వా గంపలన్నీ ? గవన్నీ బస్సుల నడ్వవు దిగు - అరె నీ మొత్కుంటనే వుంటె గట్ల ఘుసాయిస్తున్నవు బస్‌లోన్కి. నువ్ దిగుతల్లీ నీ కాల్‌మొక్త. నన్ను పరేషాన్ చేయకు ... అసలుకే ఆఫీసుల టైము, మీదికెల్లి యీ బస్సు అరగంట లేటు ఎన్కమాల ఖాళీ బస్సుల రాపో. ఈ డ్రైవర్ సాబొకడు, పబ్లిక్ ఫుల్లున్నా, బస్సు దీస్కపోయి స్టాపుల, ముంగట నుంచో బెడతడు.

ఆ .... బాబూ ! మీరు తర్వాత కొట్లాడుకుందురు గాని, టికెట్టేడికో చెప్పండి ముందుగాల. ఏంద్వయ్యా ... మీరిద్దరాపుతరా లేదా ? చెప్పండి బస్సాపిస్తమల్ల. దిగి ఆరామ్‌గా కొట్లాడుకుందురు గాని. ఎందుకు కొట్లాడుకుంటారయ్యా ? పది, పదిహేను నిమిషాల కొరకు? యీలోపటే ఒకడు ఇంగ్లీష్‌ల దిడ్తడు, ఒకడు నీ అంతు చూస్త నంటడు, కేసు పెడ్తనంటడు, చంద్రబాబు నాయుడు నా దోస్తే లెక్కంటడు నీ బొక్క లిరగ్గొట్టిస్తనంటడు. బస్సు దిగినంక ఆనిదోవ ఆనిదే .... వీని దోవ వీనిదే. మస్తు మందిని చూసిన నా సర్వీసుల గిసువంటోల్లను.

ఆ టికెట్ .... నడ్వండి సార్ జర లోనికి నడ్వండి. అరె ! ఏంద్వయ్యా గట్ల గింజుకుంటున్నవ్ ? కాలు తగలకుండ, చేయి తగలకుండ కండక్టర్ టికెట్ ఎట్లిస్తూ చేస్తడయ్యా ? కాలు తగిలిందట .... కాలు ..... గసవంటప్పుడు మంచిగ గోల్కొండ నవాబు లెక్క ఆటోల 'దిల్‌దార్‌గ' దిరగాలె. ఆర్.టి.సి.బస్సు ఎక్కద్దు మల్ల. ఛల్ జరుగు - ఊకె వొర్లకు. జరాపుకోన్నా టికెట్ యిస్యా చేయాల. ఆ జల్ది జల్ది చెప్పండి బై .... టికెట్ .... ఎన్కమాల ఎవరన్నా తీసుకోవాల్నా ? ఆ ఫుట్‌బోర్టు మీద

చెప్పండి తంబీ టికెట్ ..... ఎవడ్రా బద్మాష్ గాడు గట్ల గొడ్తున్నడు ? నీకేనారాబై తొందర ? మాకులేదా ? గంత తొందరున్నోనివి, మీ అయ్యనో గాలిమోటార్ కొన్పియ్యమని చెప్పరాదుర ? గంతసీన్ లేకనే గదా ! బస్‌ల తిర్గుతున్నవ్. మస్తుమందిని చూస్తుంటం బిడ్డా ! నీ అసువంటోల్లని - నువ్ ధభా ధభా గొడ్తే బస్సు కదుల్తాదిరా ?

ఆ రైట్ రైట్ ..... జర సందియ్యండి - ఆ ఏడికో చెప్పమ్మా ఓ మేడమ్ ! మిమ్మల్నే ..... నీయవ్వ ! యీ సెల్ ఫోన్లొచ్చినయ్ ..... మా పరేషానంతా యింతా కాదు. ప్రతీ 'బేకార్' గాని దగ్గరా సెల్‌ఫోనే. ఊ అనరు, ఆ అనరు, టికెట్టేడికో చెప్పరు. వాళ్ళలో వాళ్ళే అరుచుకుంటరు, నవ్వుకుంటరు, ఏడుస్తుంటరు పాగల్ గాని లెక్క మస్తు యాక్టింగ్ చేస్తుంటరు. ఫ్రీగా సైన్మ చూపిస్తరన్నట్టు. గంతంత సేపు ఆ ఫోన్ల ఏం మాట్లాడుకుంటరో నాకైతె ఎరికైత లేదు. ఆ చాదర్‌ఘాట్ దిగుర్రి. రైట్ రైట్. ఎన్కమాల మల్లేశమంట, టిక్కట్లు ఎవ్వలు దీస్కున్నరమ్మ - ఏందీ ఆయన్నే దీస్కోమంటవా - కండక్టర్ 'అవల' గాని లెక్క కన్పడుతున్నడా యేంది మీకు? గాయనంటే నువ్వంటడు, నువ్వంటే గాయనంటవు, తీ పైసల్దీ - మజాక్ చేస్తున్నరా ఏంది ? ఆ చెప్పవే కాకా ఏడికి ? నాంపల్లా - ఆ రెండ్రూపాయల ఆరణా పైసల్దీయ్. ఏందీ రూపాయి బారాణా నా ? గది అప్పటి ముచ్చటాయె. జమానా సంగతి గిప్పుడు జెబ్తవేందే - జల్దీ పైసల్దీయ్. ఏందీ రెండ్రూపాయల్ చేసుకోమంటావ్.

ఛల్ - గిదేమన్న కాయగూరల బేరమనుకున్నావా యేంది ? బేరం జేస్తన్నవు. నాగ్గిట్ల మండిందంటె, బస్సులకెల్లి దింపుత. వూకె లొల్లి పెట్టక పైసల్దీయ్. ఇష్షూ ..... ఏడికెల్లొస్తన్రాబై యీ పబ్లిక్ దిమాక్ ఖరాబు చేసేతందుకు. టికెట్ .... టికెట్ అరె ! నమస్తే పటేలా! ఏడికెల్లొస్తున్నవే ! పొద్దుగాల్నె పూలరంగడి లెక్క తయారైనవ్ సైన్మకు పోతున్నవాఏంది ? ఒక్కనివేనా ? లేక .... ? అవ్‌గానీ, గాదావతు మాట యేంజేసినవే ! నీయవ్వ ! కొడుకు పుడితే కనీసం 'నాచాయ్' తాగ్పియ్యలేదు 'నా పాన్దిన్పియ్యలేదు - వూక పోసికోలు ముచ్చట్లు చెబ్తుంటవు. ఛూ .... నువ్వేం పటేల్‌వయ్యా ? జరంతనన్న ఇజ్జతుండాలన్నా ! ఏందీ ఐతారం యిస్తనంటవ్ ! ఛల్ తీ-గీ ముచ్చటెంత నిజమో సూస్త. ముందుగాల నువ్వైతే నాంపల్లిల చాయ్ తాగిపియ్యి. డ్రైవర్‌సాబ్ యాద్ చేస్తున్నడే నిన్ను. ఇగో రమేషన్నా ! మన యాద్గిరి పటేలొచ్చిండు. ఇగ నువ్వే చూస్కో మల్ల. ఆ రండి బాబూ అఫజల్‌గంజ్, ఉస్మానియా దిగేటోల్లు రార్రి. ఆ టిక్కెట్ ! జరుగు తంబీ - జరంత ఎన్కమాలకు జరగండి. ఈళ్ళ కిదేం రోగమో ! ముందుగాల ఆడోల్ల కాడ నిలబడి చస్తరు. గీ బేకారు గాళ్ళందరికి లైటింగ్ కొట్టుకోనీకి ఆర్.టి.సి. బస్సులే గావాల్సి పాడైనై. గీదునియా ఎన్నటికి బాగు పడ్తదో ఏమో! ఆ జరగండమ్మా, జరంత సందియ్యండి. అరె ! ఏడి పటలేడి? రమేషన్నా ! గాంధీ భవన్ తాన దిగిపోయిండే - ఆడు కిలాడోడన్నా గాడు చిక్కుతాడు ? రిటన్‌ల రూటు మార్చుకుని పోదామన్నా గాంధీభవన్ తాన రాస్తరోకో వుందంట గద - పూరా ట్రాఫిక్ జామ్ అయితది - గందుకని అంటన్న. జర ఓ పావుగంట బండి పక్కకు పెట్టుకో. నాంపల్లిల చాయ్ తాగొద్దాం. ఆ దిగండి బాబూ దిగండి. నాంపల్లి లాస్ట్ స్టేజి దిగండి. తంబీ ఆ నిద్రపోయే సార్లను జర లేపుర్రి నాయనా లేపుర్రి.

❖ ❖ ❖

మనం కూడా బస్సు దిగుదామా ! చూశారుగా కండక్టర్ సోదరుడి అగచాట్లు. హమ్మయ్య ! యీరోజు డ్యూటీ ఐపోయింది అనుకుంటే సరిపోదు. మర్నాడు మళ్ళీ షరామామూలే. మళ్ళీ బస్సు, ట్రాఫిక్, టిక్కట్లు, జామ్‌లు, జనం, జనం, జనం ..... కండక్టర్‌ని సానుభూతితో అర్థం చేసుకుందాం సహకరిద్దాం. ✻